# సాహసమే జీవితం

రచన:
పంచిగోళ్ళ సుధ

(గత సంచిక తరువాయి)

లైట్ గ్రీన్ కలర్ పంజాబీ డ్రస్ వేసుకుంది. జడ అల్లుకోకుండా, జుట్టు మొదట్లో క్లిప్ పెట్టుకుంది. నుదుటన స్టిక్కర్ అంటించింది. అలంకరణ పెద్దగా చేసుకోక పోయినా అపర్ణ అందరి కళ్ళకూ ఆకర్షణీయంగా కనబడు తుంది. తెల్లని శరీరచ్ఛాయతో, సరైన ఎత్తు, లావుతో పొందికగా అమర్చిన శిల్పంలా ఉంటుంది. తయారై బుక్స్ తీసుకుని సీత ఇంటివైపు నడిచింది.

అపర్ణ వెళ్ళేటప్పటికి, ఏడుస్తున్న సీతను ఆమె తల్లీ తండ్రీ ఓదారుస్తున్నారు.

"ఏయ్....సీతా ; ఏడుస్తున్నావా ? సిల్లీగా ఉందే ... లే....లే....కాలేజ్ టైమవుతున్నాది. లేచి డ్రస్ చేసుకో ;" అంది అతి మామూలుగా అపర్ణ.

"చూడమ్మా ; గంటనుండి చెపుతున్నాం, మా మాట వినడం లేదు. కాలేజీకి వెళ్ళనంటుంది ; ఒక్కగానొక్క కూతురు దానిమీదే ఎన్నో ఆశలు పెట్టుకుని పెంచుతున్నాం, దాన్ని ఎంతో పెద్ద చదువులు చదివించి దాని భవిష్యత్తు తీర్చి దిద్దా లనుకున్నాం ;" అంది బాధగా సీత తల్లి.

"ఆంటీ ; మీరు బాధ పడకండి, సీత చిన్న పిల్లేం కాదు. తన భవిష్యత్తు తను ఆలోచించుకో గలదు ; తల్లి దండ్రులను సంతోషపెట్టే బాధ్యత తన కుందని కూడ తెలుసు. ఈ రోజుల్లో మనిషి సాహసించి ఆకాశంలో విహరిస్తూ చంద్ర మండలానికే పోతుంటే.... సీత సాహసించి కాలేజీకయినా పోలేదంటారా ?" అంది చిన్నగా నవ్వుతూ అపర్ణ.

"ఏమోనమ్మా నువ్వే చెప్పు ;" అంటూ సీత తల్లి అక్కడ్నుంచి వెళ్ళిపోయింది.

"సీతా ; లే....పిరికిదానిలా నీ జీవితాన్ని నువ్వే నాశనం చేసుకోకు. సాహసంతో నేటి స్త్రీలు దేశాన్ని పరిపాలించగల రోజు లివి ; ఈ చిన్న విషయానికే కుమిలి పోతూ ఇంట్లో కూర్చుంటే ఆ వెధవలు వెర్రిగా నవ్వు కుంటారు ; నే నుండగా నీ కేలాంటి భయమూ లేదు ; పద ; అంటూ ధైర్యం చెప్పింది.

"ఎందుకో నాకు చాలా భయంగా ఉంది ; ఆ రాక్షసుల నన్ను వదలరు, వాళ్ళ స్పర్శతో నా శీలం మైలబడి పోయింది. వాళ్ళ ముందు నే నుండలేను ;" అంటూ వెక్కి వెక్కి యేడ్చింది సీత.

ఆమెకు అనేక రకాలుగా ధైర్యం చెప్పి, ఒప్పించి, తన వెంటే కాలేజీకి తీసుకు వెళ్ళింది. క్లాస్‌లోకి అడుగు పెడుతూంటే సీత శరీరం సన్నగా వణికింది. గుండె భయంతో వేగంగా కొట్టు కుంటుంటే పెదవులు అదిరాయి.

తల దించుకుని వచ్చి తన సీట్లో కూర్చుంది సీత. సీత ప్రక్కనే అపర్ణ కూర్చుంది తలెత్తి ఎదురుగా నున్న బ్లాక్‌బోర్డ్ వైపు చూసి అపర్ణ శిలలా బిగుసుకు పోయింది. ఆమె ఆ కళ్ళు బిగుసుకున్నాయి. ముక్కు పుటాల్లో నుండి వెచ్చని ఉచ్ఛ్వాస, నిశ్వాసలు వేగాన్ని అందుకుంటు న్నాయి. కళ్ళలో నీరు కడుపు మంటకు ఆవిరై, రక్తపు చుక్కలే బయట పడేలా ఉన్నాయి. అంతలోనే తేరుకొని ఒక్క ఉదుటన స్టేజి ఎక్కింది.


'డియర్ స్టూడెంట్స్ ; మన క్లాసులో ఇంతటి ఆర్టిస్ట్ ఉన్నారంటే మన కాలేజీకే గర్వకారణం ? కాని ఒక్కటే లోపం ఏమిటంటే ఒక ఆడది నలుగురి చేతుల్లో చిక్కుకుని గిలగిల్లాడు తున్నాది. ఆ ఆడదాని పేరు రాసిన ఆర్టిస్ట్ మరి ఆ కామాంధులపేర్లు ఎందుకు వ్రాయనట్లో ? ఒక ఆడదాన్ని రహస్యంగా, అసహ్యంగా, అమానుషంగా పొందాలనుకున్న ఆ కామాంధుల పేర్లు నేను వ్రాసి చూపిస్తాను ;" ఆవేశంగా అంటూ చాక్‌పీస్ తీసుకుని బోర్డ్ దగ్గరకు నడిచింది.

క్లాస్ మొత్తం ఆతృతగా చూస్తున్నారు. సీత మొఖం నేలకు వ్రాలుకు పోయింది, ఆమె మనసు ముక్కలయి మూగగానే రోదించ సాగింది:

"కామాంధులు" అని సైడ్ హెడ్డింగ్ పెట్టి, ఒకటి, రెండు, మూడు, నాలుగు నెంబర్లు వరుసగా వేసి వాళ్ళ పేర్లు రాసింది కసిగా.

ఆ నలుగురూ రెచ్చిపోయి ఒక్కసారిగా అపర్ణను చుట్టు ముట్టారు.

"నీ కింత పొగరే ... మా పేర్లే బోర్డ్ కెక్కించే ధైర్య ముందన్న మాట ; మే మెవరమో తెలుసా ?" ఆ నలుగురి గొంతులూ ఒక్కసారిగా అరిచాయి.




"మీ రెవరయితే నా కేంటిరా? మహా అయితే మీలో ఒకడు రాజకీయ నాయకుడి కొడుకై ఉండొచ్చు, మరొకడు ఈ కాలేజీ ప్రిన్సిపాల్ సుపుత్రుడయి ఉండొచ్చు. ఒకడు జడ్జిగారి చుట్టమయి ఉండొచ్చు. మరొకడు యే ఇన్‌స్పెక్టర్‌కో బంధువై ఉండొచ్చు: అంతేగా .... మీరు యెవరైనా, ఎవరికి యేమయినా నా నుండి తప్పించుకో లేరు," గర్జించింది అపర్ణ.

"ఏమిటే వాగుతున్నావ్?" అంటూ ఆమె మీదకి దూకబోయారు. అంతలో క్లాస్ టీచర్ రావడంతో ఎవరి సీట్లో వాళ్ళు కూర్చుండి పోయారు.

ఆ నలుగురిలో ఒకడి చెల్లెలు తన క్లాసులోనే ఉన్నట్లు తెలుసుకుంది అపర్ణ. ఆమె పేరు శ్వేత. అపర్ణ శ్వేతతో ఆడవలసిన నాటకం గురించి వివరించింది. అన్నిటికి ఒప్పుకుంది శ్వేత.

ఒక కాగితం చుట్టచుట్టి ఆ నలుగురి మధ్యకు విసిరింది అపర్ణ, అది ఎవరు విసిరారో తెలియని ఆ నలుగురూ కాగితాన్ని ఆతృతగా విప్పి చదివారు.

"డియర్ లవర్స్! సీతలో ఏముంది అందం? పాత చింతకాయ పచ్చడి. నా దగ్గరకు రండి. మీకు ఆనందం పంచుతా. మర్చిపోరుగా రాత్రి ఎనిమిది గంటలకు ఊరు చివర గుడిదగ్గర కలుద్దాం."

—రజని.

లెటర్ చదివిన ఆ నలుగురి ముఖాలు వన్‌టెన్ నల్బల్లా వెలిగిపోయాయి.

రాత్రి ఎనిమిది అయింది. ఆ నలుగురూ గుడి దగ్గరకు వచ్చారు. అప్పటికే ముసుగు కప్పుకుని తమ కోసమే ఎదురుచూస్తున్న ఆమెను చూసి నోరు చప్పరించుకుంటూ, నలుగురూ నేను ముందంటే .... నేను ముందంటూ ఆమె పైకి ఉరికారు.

"ఆగండిరా! నా ముఖంలోకి చూచి, నా ఒంటిమీద చెయ్యి వెయ్యండిరా!" అరిచింది శ్వేత.

"అమ్మా.... శ్వేతా! నువ్వా? ఏమిటమ్మా ఈ దారుణం?" బాధగా అరిచాడు వినోద్.

"నేనే అన్నయ్యా! నీకు ఎవరయితేనేం .... అనుభవించు. నీకు వరసలు అడ్డొస్తే ఆ ముగ్గుర్ని నన్ను అనుభవించమను. నువ్వు పక్కన నిలబడి సంతోషించు. ఎందుకన్నయ్యా ఇంత నీచస్థితికి దిగజారావు? ఎంతమంది ఆడవాళ్ళ జీవితాలను నాశనం చెయ్యాలనుకుంటున్నావ్?"

"శ్వేతా!"

"నో....అలా పిలవకు. ఈ రోజు ఆ అపర్ణే సాహసించి ఈ నాటకం ఆడకపోతే .... నీ కళ్ళు తెరుచుకుని ఉండేవి కావు. ఇప్పటికయినా బుద్ధి తెచ్చుకుని ఆ సీతకి క్షమాపణ చెప్పుకోండి."

"ఒరేయ్ వినోద్! మా మూడ్ పాడు చెయ్యకు. నువ్వద్దులే .... లడ్డులాంటి పిల్ల ఎదురుగా ఉంటే వదిలిస్తూ ఊరుకోవడం మగతనం కాదని పాఠాలు చెప్పినవాడివి నువ్వే." అంటూ ఆ ముగ్గురూ శ్వేతమీద పడ్డారు.

అంతవరకూ చూస్తున్న అపర్ణ ఆ ముగ్గురి మీదకి ఉరికింది. వినోద్, శ్వేతను పక్కకు లాగాడు. అపర్ణ, వినోద్‌ల దెబ్బలదాడికి ఆ ముగ్గురూ పరుగు తీశారు.

"అపర్ణగారూ! నన్ను క్షమించండి, మీలాంటి సాహసవంతులుంటే నాలాంటివా రుండరు. మా చెల్లెకి కూడా కరాటె నేర్పండి! మరో విషయం. నేను అవమానించిన సీతను నాదానిగా చేసుకుంటాను" అంటూ పక్కనే ఉన్న సీత కళ్ళలోకి చూచాడు వినోద్.

అపర్ణ, శ్వేతలు తృప్తిగా చూచుకున్నారు.

(సంపూర్ణం)

ఎల్లప్పుడూ.......

టి. ఎన్. హెచ్. వారి

* సైనిక్స్ * ఆర్. ఓ.

కలర్ బనిన్లనే

ఉపయోగించండి.

ఆంధ్రా మరియు ఒరిస్సా ఏజెంట్లు:—

దుర్గా ఏజెన్సీస్, పి. బి. నెం. 84, విశాఖపట్నం-4.